ఏకధాటిగా వరుణుడి ఆగ్రహం!

- ఎడతెరిపి లేకుండా వర్షం.. జలమయమైన రోడ్లు
- నీటమునిగిన శివారు కాలనీలు, పంటపొలాలు
- టోల్‌గేటు వద్ద వాహనాల రాకపోకలకు అంతరాయం
- టిడ్కో నివాసితుల ఇక్కట్లు


ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారిలో వరదనీరు

మంగళవారం అర్ధరాత్రి నుంచి మంగళగిరి నగరంలో భారీ వర్షం కురియడంతో పల్లపు ప్రాంతాలన్నీ చెరువులను తలపించాయి. నగర పరిధిలోని ఇందిరా నగర్, కొత్తపేట, రత్నాలచెరువు, లక్ష్మీ నరసింహ స్వామి కాలనీ, బాపనయ్యనగర్, ఎస్టీ కాలనీ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో నివాసితులు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. రాత్రి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు.

మంగళగిరి టౌన్: మంగళగిరి నియోజకవర్గం వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షానికి వాగులు, వంకలు పొంగి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరదనీరు రహదారులపైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి. దీంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌ఆర్‌ఐ వైద్యశాల వద్ద రహదారి కోతకు గురికావడంతో రోడ్డుపైకి రెండు అడుగుల ఎత్తు వరకు నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, వైద్యశాలకు వచ్చే రోగులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. టిడ్కో గృహ సముదాయంలో భారీ వర్షానికి రోడ్లపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో కాలువలు నిండిపోయి బ్లాకుల వద్దకు మురుగు చేరి ఇబ్బందులు పడుతున్నామని టిడ్కో కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండల పరిధిలో వేల ఎకరాల పంటపొలాలు నీట మునిగాయి. ఎంత నష్టం వాటిల్లిందనేది అధికారులు అంచనా వేస్తున్నారు.

నగరంలో రోడ్లన్నీ జలమయం..

భారీ వర్షం కారణంగా మంగళగిరి గౌతమ బుద్ధ రోడ్, ఎన్‌ఆర్‌ఐ వైజంక్షన్, ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రి రోడ్డు, రత్నాల చెరువు ఎస్టీ కాలనీ రోడ్లన్నీ జలమయమై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎన్‌ఆర్‌ఐ హాస్పటల్‌కు వెళ్లే రహదారి పూర్తిగా నీటితో నిండిపోవడంతో ఆసుపత్రికి వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు నీటి ప్రవాహంలో ఇరుక్కుపోయాయి. వీటిని బయటకు లాగేందుకు అధికారులు జేసీబీలను తీసుకువచ్చి వాహనాలను అక్కడి నుంచి తరలించారు. ఎన్‌ఆర్‌ఐ వైజంక్షన్ అండర్‌పాస్‌లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. గౌతమ బుద్ధ రోడ్‌లోని డ్రైనేజీలు మొత్తం వర్షానికి పొంగి పక్కనే ఉన్న సూపర్‌బజార్, హోటల్స్‌లోకి నీరు చేరుకుంది. రత్నాల చెరువు, లక్ష్మీ నరసింహ కాలనీ, ఎస్టీ కాలనీల్లో నీరు నిలిచిపోయింది. ఎస్టీ కాలనీలో ఇళ్లలోకి నీరు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుచోట్ల ఇళ్లల్లో గుంట మగ్గాలతో పనిచేసుకునే చేనేత కార్మికులు పలు ఇబ్బందులు పడ్డారు. గుంట మగ్గాల్లోకి నీరు చేరడంతో ఆవేదన వ్యక్తం చేశారు.


టిడ్కో నివాస గృహాల మధ్య వర్షంనీరు


చినకాకానిలో కోతకు గురైన మార్గాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అలీమ్‌బాషా

వర్షం నీటిలో చిలువూరు జగనన్న కాలనీ..

దుగ్గిరాల: బుధవారం కురిసిన వర్షానికి దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలోని జగనన్న కాలనీ జలమయమైంది. కాలనీలో రహదారులు, మురుగు కాలువలు లేకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయింది. దీంతో కాలనీ వాసులు వరద నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు 60 కుటుంబాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నామని.. అధికారులు కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని స్థానికులు వాపోయారు.


కాలనీలోకి చేరిన వర్షపు నీళ్లల్లో మహిళ

వాహనచోదకుల ఇక్కట్లు..

ఫిరంగిపురం: విపరీతమైన వర్షానికి మండలంలోని పలు గ్రామాల పంటపొలాల్లో నీటమునిగాయి. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. మొక్కలు ఎదుగుతున్న క్రమంలో పొలాల్లో నీరు నిలిచిపోవడంతో నష్టపోతామని కర్షకులు వాపోతున్నారు. అధిక వర్షం కారణంగా మునగపాడు, బేతపూడి, ఫిరంగిపురం నుంచి 113.తాళ్లూరు వెళ్లేదారిలోని బ్రిడ్జి, రోడ్లపై నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనచోదకులు ప్రయాణించే వీలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు.


ఫిరంగిపురం నుంచి తాళ్లూరు వెళ్లేదారిలో పరిస్థితి..

క్లుప్తంగా

రాష్ట్రపతి అవార్డు గ్రహీతకు సత్కారం



మంగళగిరి టౌన్: ఇటీవల న్యూ ఢిల్లీలో జరిగిన భారత స్కౌట్ అండ్ గైడ్ రాష్ట్రపతి అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నుంచి అడ్డగార్ల వినీల భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి రాష్ట్రపతి గైడ్ పురస్కారం అందుకున్నట్లు భారత స్కౌట్ అండ్ గైడ్ రాష్ట్ర కార్యదర్శి, డైరెక్టర్ ఓపెన్ స్కూల్ ఆర్.నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా వినీలను బుధవారం రాష్ట్ర స్కౌట్ అండ్ గైడ్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్కౌట్, గైడ్స్ పురోభివృద్ధికి సహకరిస్తామని, మరింత మంది ఇలానే అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఓసీ శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా డీవోసీ ప్రసాద్, స్కౌట్ మాస్టర్ యోగేశ్వరరావు, గైడ్ కెప్టెన్ రమణి, సిబ్బంది ప్రియాంక, వెంకట రమణ పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి



తాడేపల్లి రూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ కార్మికులకు మంత్రి నారా లోకేష్ న్యాయం చేయాలని.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. బుధవారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు డి.నాగేశ్వరరావు, నరసింహారావులతో కలిసి ఆయన ప్రారంభించారు. చట్టప్రకారం తమకు న్యాయంగా రావాల్సిన బకాయిలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని వారు అన్నారు. కార్యక్రమంలో ఇశ్రాయిల్, సుబ్బారావు, బాష, కార్మికులు శారద, రమణ, ఏడుకొండలు, దుర్గాభవాని, ఇమాంబి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన సెంట్రింగ్.. తప్పిన ప్రమాదం!



తాడేపల్లి రూరల్: మంగళవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి తాడేపల్లి పట్టణ పరిధిలోని బైపాస్‌రోడ్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ భవానికి సంబంధించి సెంట్రింగ్ కూలిపోయింది. సెంట్రింగ్ హై టెన్షన్ విద్యుత్ లైన్లపై పడింది. ఆ సమయంలో ప్రజలు ఎవ రూ రాకపోకలు సాగించకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

ముంపు ప్రాంతాల పరిశీలన



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో అధిక వర్షాల వల్ల ముంపునకు గురైన ప్రాంతాలను సీపీఎం నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావులు మాట్లాడుతూ.. ఎర్రక్వారీ, తెల్లక్వారీలతో పాటు పలు ప్రాంతాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరిందని, అధికారులు యుద్ధ ప్రాతిపదికన వర్షపు నీటిని తరలించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహానాడుతో పాటు తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లోనూ రోడ్లపై వర్షపు నీరు వచ్చి చేరిందని అన్నారు. కార్యక్రమంలో నారిన నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలను వినియోగించుకోవాలి

మంగళగిరి టౌన్: లోతట్టు ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలను వినియోగించుకోవాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ శకుంతల బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురియనున్నాయని.. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నగర పరిధిలోని రత్నాల చెరువు, ఎస్టీ కాలనీ నివాసాల్లోకి నీరు చేరుకుందని, ఆ ప్రాంత వాసులకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, సుమారు 25 కుటుంబాలను కేంద్రానికి తరలించి సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. నగర పరిధిలోని గండాలయపేట, వీవర్స్ కాలనీ, కొత్తపేటతో పాటు తాడేపల్లి పరిధిలోని తెల్లక్వారీ ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని.. ఆయా ప్రాంత ప్రజలు వాటిని వినియోగించుకోవాలని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

150 మందికి లింగాకర్షణ బుట్టలు పంపిణీ


బుట్టలు అందజేస్తున్న మోహన్‌రావు

ఫిరంగిపురం: పత్తిపంట సాగులో సమగ్ర సస్యరక్షణ ద్వారా గులాబీకాయ తొలుచు పురుగు నివారణను లింగాకర్షక బుట్టల ఏర్పాటుతో నివారించవచ్చని జిల్లా సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎస్.మోహన్‌రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని ఐసీడీఎస్ కార్యాలయం భవనంలో ఎల్‌డీసీ సహకారంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో పత్తిపంటలో గులాబి రంగు పురుగు నివారణపై బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మోహన్‌రావు మాట్లాడుతూ.. మొక్కలు వచ్చిన 45 రోజుల తరువాత గులాబిరంగు పురుగును గుర్తించి లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మితిమించి రసాయన మందులు వాడవద్దని చెప్పారు. అనంతరం 150 మంది రైతులకు 10 చొప్పున లింగాకర్షక బుట్టలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కె.సాల్మన్‌పాల్, ఎల్‌డీసీ సంస్థ రీసెర్చ్ అనలిస్ట్ ఉపేంద్రరెడ్డి, ఏవో వాసంతి, సీడీపీవో అనూరాధ, కారుణ్య సంస్థ డైరెక్టర్ మధుసూధన్‌రావు, రైతులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో ఇబ్బంది పడుతున్న ప్రజలు!


ఎన్‌ఆర్‌ఐ కళాశాల రోడ్డులో వరద ఉధృతికి కొట్టుకుపోతున్న కారు

మేడికొండూరు: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్ష ప్రభావానికి పలు గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ప్రధానమైన రోడ్లు, పేరేచర్లలోని నరసరావుపేట బైపాస్ రోడ్డు, గుంటూరు రోడ్‌లోని క్వారీ కార్మికులు నివసించే ఆరోమయులు కాలనీ జలదిగ్బంధంలో ఉంది. ఎన్నారై కళాశాలకు వెళ్లే రోడ్డులో ఉన్న వాగు ఉధృతికి కారు కొట్టుకుపోయింది. స్థానికులు గమనించి కారులో ఉన్న వ్యక్తులను బయటకు తీశారు. మండలంలోని కొండవీడు వాగు, వాగులు పొంగి ప్రమాదకర స్థాయిలో ప్రవహించాయి. కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు గ్రామాల్లో సాగవుతున్న వ్యవసాయ పంటలు పత్తి, మిర్చి నారు, నీట మునిగాయి.

తాడికొండ: రాజధాని ప్రాంతమైన అమరావతితో పాటు పరిసర గ్రామాలకు చెందిన 70 గ్రామాల ప్రజలకు అవసరమైన లాం కొండవీటి వాగు వంతెనపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని సీపీఎం తాడికొండ మండల కార్యదర్శి చింతల భాస్కర రావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 79 ఏళ్ల క్రితం నిర్మించిన లో లెవల్ చప్టానే నేటికీ ప్రజలు ఉపయోగించాల్సి రావడం ప్రమాదకరం కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు అనువైన రవాణా మార్గం అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అవయవదానంపై అవగాహన పెరగాలి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మంగళగిరి టౌన్: ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన పెంపొందించుకోవాలని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రమణ యశస్వి అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని సీకే జూనియర్ కళాశాలలో బుధవారం జాతీయ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని అవయవదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు అధ్యక్షత వహించారు. అవయవదానం పట్ల అవగాహనపై పలు కళాశాలల విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా కార్యక్రమాధికారి జేవీ సుధీర్‌కుమార్, మంగళగిరి ప్రభుత్వ వైద్యశాల వైద్యురాలు స్నేహరాజ్, గుంటూరు జిల్లా అవయవదాన సెక్రటరీ రేకా నర్మద, సీకే విద్యాసంస్థల కరస్పాండెంట్ గంజి చిరంజీవి, మంగళగిరి బుద్ధ విహార వ్యవస్థాపకులు రేఖా కృష్ణార్జునరావు, ప్రజా గాయకులు కంచర్ల కాశయ్య, తదితరులు పాల్గొన్నారు. ఆత్మకూరులోని నిర్మలా ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం అవయవదాన ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో డిగ్రీ కళాశాల విద్యార్థులు, నిర్మల హైస్కూల్ విద్యార్థులు, అధ్యాపకులు, నిర్మలా కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ రేఖ, నరేష్ బాబు, మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తం!


తాడికొండ-నిడమర్రు రహదారిపై కొట్టుకుపోయిన రోడ్డు


గండి పడిన పొన్నెకల్లు తాగునీటి చెరువు

తాడికొండ: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తాడికొండ, తుళ్లూరు మండలాల్లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం కావడంతో పాటు కొండవీటి వాగుకు గత 20 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాల్లో భారీగా వరదనీరు చేరింది. లాం వద్ద కొండవీటి వాగు, కంతేరు ఎర్రవాగు, పెదపరిమి కోటేళ్లవాగులు పొంగి పొర్లడంతో రాజధానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఏపీ సచివాలయం, హైకోర్టు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ఒక్కరు కూడా వెళ్లలేకపోవడంతో కార్యాలయాల్లో సేవలు స్తంభించాయి. తహసీల్దార్, ఎంపీడీవో, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు ఒక్క ఉద్యోగి కూడా హాజరయ్యే పరిస్థితి లేక మూతపడ్డాయి.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మంగళగిరి టౌన్: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు జలమయమైన లోతట్టు ప్రాంత ప్రజలకు సహాయం అందించేందుకు ఎంటీఎంసీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ అలీమ్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుకోని విపత్తుల సమయంలో 24 గంటలూ సేవలు అందించేందుకు 70939 12653 టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంటుందని.. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకూ సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకూ కురిసిన భారీ వర్షానికి ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదని.. మంగళగిరి, చినకాకాని, తాడేపల్లి ప్రాంతాల్లో పర్యటించి తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలియజేశారు. కొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలు రెండు రోజుల పాటు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంగళగిరి టౌన్: ఏపీ వాతావరణ సూచనల మేరకు శనివారం వరకూ మంగళగిరి పరిధిలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని మంగళగిరి ఎమ్మార్వో దినేష్ రాఘవేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని దిగువ ప్రాంతాలు, మంగళగిరి కొండ కింద ఉన్న ప్రాంతాలు, గుంటూరు చానల్ పరిసర గ్రామాలు, కొండవీటివాగు ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లరాదని స్పష్టంచేశారు. రామచంద్రాపురం లంకలో రైతులు, పశువుల కాపరులు వరద నీరు తగ్గే వరకూ ప్రవేశించరాదన్నారు. ప్రజలు ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా ఈ సూచనలు పాటించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

పెండింగ్ బిల్లులకు మోక్షం

దుగ్గిరాల: 2014–19 కాలంలో పూర్తయిన పనులకు బిల్లులను చెల్లించేందుకు సముఖంగా ఉన్నట్లు షేక్.జబీన్ తెలిపారు. బుధవారం దుగ్గిరాల మండలం మండల సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని 13 గ్రామాల్లో పూర్తయిన పనులు 89 ఉండగా.. వాటికి సంబంధించిన రూ.35,61,391 బిల్లులు వారం రోజుల్లో ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యశాల అధికారి ఆర్.అపర్ణ, జీవీఎస్ గుప్తా, డ్వామా ఏపీడీ ఎం.శివనారాయణ, యార్డు చైర్మన్ వి.ఝాన్సీ రాణి, చంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

డీబీఆర్సీ ఆధ్వర్యంలో భోజనాలు పంపిణీ

మేడికొండూరు: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ కూరపాటి నిర్మల ఆధ్వర్యంలో మేడికొండూరు వైవీఆర్ కాలనీ వాసులకు బుధవారం భోజనాలు పంపిణీ చేశారు. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం కారణంగా వాగులు పొంగిపొర్లడంతో కాలనీ వాసులు నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకున్న సంస్థ సభ్యులు కాలనీ వాసులకు రాకపోకలు నిలిచిపోవడంతో వారికి సహాయం చేయాలని భోజనాలు తెప్పించి తహసీల్దార్ రాఘవరావు, ఇన్‌చార్జి మండల అభివృద్ధి అధికారి పూర్ణ శంకర్‌రావు ఆధ్వర్యంలో ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పంచాయతీ సెక్రెటరీ, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి నీట మునిగిన పొలాలు


చిలువూరులో నీట మునిగిన నిమ్మతోట

దుగ్గిరాల: పంట సాగునీటి కాలువల మట్టం సకాలంలో తగ్గించడం వల్ల పొలాల్లో ముంపు నీరు బయటకు వెళుతుందని ఆర్.విజయబాబు తెలిపారు. బుధవారం దుగ్గిరాలలోని వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలో 15,288 ఎకరాల పంట నీట మునిగినట్లు ఆయన తెలిపారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లాలో 90 వేల ఎకరాల వరి వెద పద్ధతిలో పెట్టారని.. అకాల వర్షానికి కొంత పంట జలమయం అయ్యిందని అన్నారు. మండలంలో నిమ్మ తోటలు నీట మునిగాయని ఆయన పేర్కొన్నారు.

కేఎల్‌యూలో ముగిసిన జాతీయస్థాయి వర్క్ షాపు


వర్క్ షాపును ప్రారంభిస్తున్న అతిథులు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో బుధవారం కేఎల్‌యూ ఫార్మసీ కళాశాల జాతీయ స్థాయి వర్క్‌షాపు ఘనంగా ముగిసింది. ఐసీఎంఆర్, డీహెచ్‌ఆర్ ఆర్థిక సహకారంతో ప్రిసిషన్ మెడిసిన్‌ను ముందుకు తీసుకువెళ్లడానికి ఫార్మకో జీనోమిక్స్‌పై రెండు రోజుల జాతీయ స్థాయి కార్యశాలను నిర్వహించారు. కేఎల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, భారత ప్రభుత్వం, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ రీసెర్చ్ సంయుక్త ఆధ్వర్యంలో క్లినికల్ ప్రాక్టీస్‌లో ఫార్మా కోజీనోమిక్స్, ఆప్టిమైజింగ్ డ్రగ్ థెరపి త్రూ పర్సనలైజ్డ్ మెడిసిన్‌పై నిర్వహించిన రెండు రోజుల కార్యశాలకు వివిధ దేశాలలోని ఆయా యూనివర్సిటీలకు చెందిన పలువురు ప్రొఫెసర్లు, దేశంలోని పలు యూనివర్సిటీల శాస్త్రవేత్తలు, పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. పుదుచ్చేరికి చెందిన జిప్‌మెర్ నుంచి డాక్టర్ జయంతి మద్యయ్యాన్ ముఖ్య అతిథిగా విచ్చేసి రోగుల జన్యు అలంకరణకు అనుగుణంగా ఔషధ చికిత్సను రూపొందించే ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో మంగళగిరి ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రి నుంచి డాక్టర్ జి.శ్రీనివాస్, కేఎల్‌యూ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎస్.జగన్నాధరావు, ఆర్అండ్ఆర్‌డీ, లైఫ్ సైన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బుచ్చి నల్లూరి, కేఎల్‌యూ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.చక్రవర్తి, పుదుచ్చేరికి చెందిన జిప్‌మెర్ డాక్టర్ ఉప్పుగుండూరి చక్రధరరావు, జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డాక్టర్ జేపీ అరుణ్, మణిపాల్ యూనివర్సిటీ డాక్టర్ మహాదేవు, రవీస్ అమెరికన్ క్యాన్సర్ సెంటర్ వైద్యులు డాక్టర్ రామలింగం, పాలక్కి యూనివర్సిటీకి చెందిన డాక్టర్ అల్లాడి చరణ్‌రాజ్ గౌడ్, వర్సిటీ ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు


జెండాచెట్టు సెంటర్ వద్ద నీటిలోనే రాకపోకలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో మంగళ, బుధవారాల్లో భారీగా వర్షా లు కురియడంతో కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి ప ట్టణ, రూరల్ ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ముంపు నీటిలోనే స్థానికులు రాకపోకలు సాగించారు. నివాసాల్లోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ పరిధిలోని తెల్లక్వారీ, ఎర్రక్వారీ, జెండాచెట్టు సెంటర్, ఇస్లాంపేట తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి ప్రజ లు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఉండవల్లి, పెనుమాక గుండిమెడ, కొలనుకొండలో లోతట్టు ప్రాంతాలోకి వర్షపునీరు చేరింది.

మునిగిన పంటలు..

తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో ఎక్కువ మంది రైతులు వాణిజ్య పంటలు పండిస్తుండడంతో ఆ పంటపొలాల్లో వర్షపునీరు చేరింది. పసుపు తోటల్లో వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల వేరు కుళ్లి వైరస్ సోకుతుందని.. కంద బరువెక్కి విరిగిపోతుందని రైతులు తెలిపా రు. కుంచనపల్లి, ప్రాతూరు ప్రాంతాల్లో రైతులు ఎక్కు వ శాతం ఆకుకూర మడులు ఏర్పాటు చేశారు. పంట పొలాల్లోంచి వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక మడులు పూర్తిగా మునిగిపోయాయి. ప్రస్తుతం పూర్తి గా నష్టపోనున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.


గుండిమెడ రోడ్డులో నీట మునిగిన కందపంట

తాడికొండ: రానున్న 2, 3 రోజుల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. తుళ్లూరు మండలంలోని కృష్ణానదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుళ్లూరు తహసీల్దార్ హరిబాబు సూచించారు. దిగువ ప్రాంతంలోని ప్రజలు, లంక గ్రామాల ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అన్నారు. అన్ని గ్రామాల్లోని రెవెన్యూ అధికారులు, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారని.. వరద నష్టం ఇతర ఇబ్బందులు ఏమైనా ఎదురైతే వారికి తెలియజేయాలని సూచించారు.